సాక్షి తిరుపతి

మంగళవారం । 25 । మార్చి । 2025



నిమ్మతోట ఆక్రమణకు యత్నం

కలువాయిలో ఓ రైతు 14 ఏళ్లపాటు సాగు చేసుకుంటున్న భూమిని కూటమి నేతలు ఆక్రమించేందుకు యత్నించారు. - 8లో



నేటి నుంచి పరీక్షలు

వివిధ పోస్టులకు సంబంధించి మంగళవారం నుంచి మూడు రోజుల పాటు పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఆర్వో తెలిపారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సా)	సహర్ బుధవారం (ఉ)
తిరుపతి	6-27	4-54
గూడూరు	6-22	4-49

న్యూస్‌రీల్

చెన్నైకి కండలేరు జలాలు



నీటిని విడుదల చేసేందుకు స్విచ్ ఆన్ చేస్తున్న ఈఈ విజయకుమార్‌రెడ్డి

రాపూరు: మండలంలోని కండలేరు జలాశయం నుంచి సోమవారం చెన్నైకి నీటిని విడుదల చేసినట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కండలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద ఉన్న పవర్‌ప్లాంట్ యూనిట్ నుంచి నీటిని విడుదల చేశారు. ముందుగా గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్విచ్ ఆన్‌చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతి, నెల్లూరు జిల్లా ప్రజలకు, రైతులకు తాగు, సాగు నీటి అవసరాల నిమిత్తం 830 క్యూసెక్కులు అందిస్తామన్నారు. అలాగే చెన్నై నగర వాసులకు సోమవారం మొదటగా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు వెల్లడించారు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 49.623 టీఎంసీల నీరు ఉందన్నారు. డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుమలయ్య, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించండి



డీపీఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

తిరుపతి అర్బన్: పని ఒత్తిడి తగ్గించాలంటూ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సోమవారం జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి రామ్మోహన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అలాగే జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవికి కూడా విన్నవించారు.

ఉపాధి పనుల్లో.. సౌకర్యాలు కల్పించండి

తిరుపతి అర్బన్: ఉపాధి హామీ పనుల్లో కూలీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉదయమే పనులు ప్రారంభించి 11 గంటలకల్లా పూర్తి చేయాలని సూచించారు. నీడ కోసం, తాగునీటి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడం, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచడం లాంటివి చేయాలని చెప్పారు. 60 ఏళ్ల పైబడిన వారు మధ్యాహ్నం 12 గంటలపైన ఇంటికే పరిమితం కావడం ఉత్తమమన్నారు.

తిరుపతి నగర నడిబొడ్డున నివసిస్తున్న అట్టడుగు వర్గాల ఆవాసాలపై కూటమి ప్రభుత్వం కన్నుపడింది. అభివృద్ధి పేరుతో ఆ పేదల కాలనీని ఖాళీ చేయించి పెత్తందారులకు కట్టబెట్టేందుకు మరో మారు కుట్ర పన్నుతోంది. బహుళ అంతస్తుల మోజు చూపి స్థానికుల్ని వర్గాలుగా విడగొట్టి ఖాళీ చేయించేందుకు అడుగులు వేస్తోంది. 2018లోనూ ఇదే తరహాలో ఆ కాలనీపై దండయాత్ర ఆరంభించింది. ఇప్పుడు మరోసారి కొట్టేసేందుకు స్కెచ్చేసింది.

కన్నేసి.. కాజేసే కుట్ర!



స్కావెంజర్స్ కాలనీపై కూటమి కన్ను

- అభివృద్ధి పేరుతో కాలనీని ఖాళీ చేసే పన్నాగం
- గతంలో యుద్ధ వాతావరణం
- నాడు అండగా నిలిచిన ప్రతిపక్షం
- ఓ మంత్రి మంత్రాంగంతో మరోసారి రంగంలోకి

తిరుపతి తుడా: తిరుపతి పారిశుద్ధ్య కార్మికుల కోసం నాడు నగర శివారు ప్రాంతంగా ఉన్న దేవేందర్ థియేటర్ రోడ్డు, హరిచంద్ర శ్మశాన వాటికకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఇళ్ల స్థలాలను కేటాయించారు. సర్వే నం.414 / 2ఏలో మూడు ఎకరాల 50 సెంట్లు, 414/2లో 1.11 ఎకరాల్లో నాటి పాలకులు కాలనీగా ఏర్పాటు చేశారు. సుమారు ఏడు దశాబ్దాలుగా ఆ కుటుంబాలు అక్కడే నివసిస్తున్నాయి. వీరి బాగుకోరి నాడు స్కావెంజర్స్ కాలనీని ఏర్పాటు చేశారు. ఇళ్ల స్థలాలతో పాటు అక్కడే వారి పిల్లలకు పాఠశాల, ఆస్పత్రిని సైతం కట్టించారు. ఆ స్థలాలు కార్మికులకు తరతరాలుగా స్థిరాస్తిగా నిలిచాయి. మొత్తం 360 కుటుంబాలు నివసిస్తున్నాయి. దశాబ్దాల పేదల ఆస్తిపై కూటమి ప్రభుత్వం కన్ను పడింది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయిస్తామని తెరపైకి తీసుకొస్తోంది. దీని వెనుక పెద్ద కుట్ర దాగుందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

అభివృద్ధి పేరుతో కుట్ర

స్కావెంజర్స్ కాలనీ పరిధిలోని మొత్తం 4.61 ఎకరాల విస్తీర్ణంలో నివాసాలు ఉన్నాయి. ఈ స్థలంపై చంద్రబాబు కన్నుపడింది. ఆయన ప్రభుత్వంలో మంత్రిగా పనిచేస్తున్న నో వ్యక్తికి ఆ స్థలాన్ని కట్టబెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అభివృద్ధి పేరుతో స్లమ్ ఏరియాగా ఉన్న ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించి ప్రైవేట్ వ్యక్తులు (తన బినామీలు) చేతిలో పెట్టేందుకు తెరలేపారు. వీటన్నింటినీ తిప్పికొట్టిన పేదలను ఇప్పుడు మరోమారు మోసం చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసి ఇస్తామంటూ మాయ మాటలకు తెరలేపారు. నయానో భయానో ఆ ఇళ్లను ఖాళీ చేయించేందుకు ఎత్తులు చేస్తున్నారు. ససేమీర అంటే యుద్ధ వాతావరణమైనా సృష్టించి కాజేయాలని పావులు కలుపుతున్నట్లు తెలుస్తోంది.

బహుళ అంతస్తులకు ప్రతిపాదనలు

స్కావెంజర్స్ కాలనీలోని 4.61 ఎకరాల స్థలంలో పీపీపీ పద్ధతిన అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్‌కు ఆదేశాలు అందాయి. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం కాలనీలో సర్వే చేపట్టారు. అభివృద్ధి పేరుతో ప్రయివేట్ వ్యక్తికి ఆ ప్రాంతాన్ని కట్టబెట్టేందుకు పావులు కదుపుతున్నారు. 60/40 లెక్కన 4.61 ఎకరాలలో 60 శాతం భూమిని అభివృద్ధి చేసే ఆ వ్యక్తి అధికారికంగా దక్కించుకుంటారు. దేవేంద్ర థియేటర్ రోడ్డుకు 300 అడుగులు పొడవుతో కాలనీ ఉంటుంది. మెయిన్ రోడ్డుకు పొడవునా ఖరీదైన 60 శాతం స్థలాన్ని కాంట్రాక్టర్ దక్కించుకుంటే, లోపల ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించి కాలనీ వాసులకు ఇవ్వాలని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అయితే ఖాళీ చేయించాక మరో ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనం కట్టిస్తారా? నిజంగానే స్కావెంజర్స్ కాలనీలోనే 40 శాతం భూమిలో అపార్ట్‌మెంట్ కట్టిస్తారా అన్నది డాలర్ల ప్రశ్న. 40 శాతం స్థలంలో బహుళ అంతస్తుల భవనం కట్టినప్పుడు సెట్ బ్యాక్ వదలడం, స్కూల్, ఆస్పత్రి వంటి భవనాలు అక్కడ ఏర్పాటు చేయడం సాధ్యమేనా..? అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

గతంలో భయానక వాతావరణం

గతంలో చంద్రబాబు ప్రభుత్వం స్కావెంజర్స్ కాలనీ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చింది. 2018లో సీఎం హోదాలో చంద్రబాబు స్వయంగా కాలనీకి వచ్చి ఒప్పించే ప్రయత్నం చేశారు. కాలనీ వాసులను రెండు వర్గాలుగా చీల్చి విభజించు పాలించు పద్ధతిని అమలు చేశారు. పోలీసులు, అధికారులు వందల సంఖ్యలో కాలనీని చుట్టుముట్టి ఖాళీ చేయించేందుకు జేసీబీ యంత్రాలను రంగంలోకి దింపారు. టీడీపీ సానిభూతిపరులు ఇళ్లు కూల్చేందుకు సహకరించేలా ఎత్తులు వేశారు. కాలనీ వాసులు రెండు వర్గాలుగా చీలిపోయి పోట్లాడుకునే పరిస్థితులను సృష్టించారు. అయినా మెజారిటీ కాలనీ వాసులు ప్రభుత్వ కుట్రలకు ఎదురు నిలబడి ఆ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకున్నారు. కాలనీపై పోలీసుల దండయాత్ర, టీడీపీ నేతల దౌర్జన్యాలు, మానవ హక్కుల ఉల్లంఘన, ట్రైబల్ హక్కులను కాలరాయడం పట్ల నాడు తిరుపతి కోర్టు ఆ కేసును సుమోటోగా స్వీకరించింది. కాలనీ వాసులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. నాడు ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీతోపాటు, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటై పేదలకు అండగా నిలిచాయి. అయితే ఇప్పుడు మరోమారు స్కావెంజర్స్ కాలనీ వ్యవహారం తెరపైకి రావడంతో గందరగోళం నెలకొంది. కాలనీ వాసులు భయంగా గడుపుతున్నారు.

దౌర్జన్యం చేసినవారిపై ఫిర్యాదు

- ఫిర్యాదు తీసుకోని పోలీసులు

తిరుపతి రూరల్: మండలంలోని తిరుచానూరు పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన వేలంలో దౌర్జన్యం చేసి ప్రత్యర్థుల టెండరు ఫారాలు, డీడీలు లాక్కున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుచానూరుకు చెందిన దేవేందర్ రెడ్డి, దూర్వాసులు రెడ్డి పంచాయతీ ప్రయివేటు టూరిస్టు బస్టాండు టెండరు వేసేందుకు వెళ్లగా పంచాయతీ కార్యాలయం ముందున్న కూటమి నేతలు అడ్డగించి టెండరు ఫారాలు, డీడీలు, జీఎస్టీ కాపీలను తీసుకుని వెళ్లినట్టు తెలిపారు. తమను టెండరు వేయనీయకుండా అడ్డగించి బలవంతంగా తమ వద్ద నుంచి రూ.40లక్షలకు సంబంధించిన బ్యాంకు డీడీలను లాక్కుని వెళ్లిన సాయి రాయల్, కిషోర్ రెడ్డి, శ్రీధర్‌నాయుడు మరో ముగ్గురు వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని తమ డీడీలను ఇప్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదు స్వీకరించడానికి మొగ్గు చూపని తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ ఆ డీడీలు ఎవ్వరు చింపలేదని, వాటిని తెప్పించి అందజేస్తామని చెప్పి బాధితులకు నచ్చజెప్పినట్టు సమాచారం.

వ్యక్తిత్వ వికాసంలో అధ్యాపకులే కీలకం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో అధ్యాపకులదే కీలక పాత్ర ఉంటుందని ఎస్వీయూ వీసీ అప్పారావు పేర్కొన్నారు. ఎస్వీయూ కల్చరల్ అఫైర్స్ స్టూడెంట్ వెల్ఫేర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, సెట్విన్ డైరెక్టర్ మోహన్ కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పద్మావతి మహిళా కళాశాల, ఎస్వీయూ రెండు వేదికల్లో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సైకాలజిస్ట్ శ్రీనివాస్ వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వాప్ చైర్మన్ రవినాయుడు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పద్మావతి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నారాయణమ్మ, ఎస్వీయూ ప్రిన్సిపల్స్ నరసయ్య, సుబ్బారావు, కల్చరల్ అఫైర్స్ డైరెక్టర్ ఆచార్య మురళీధర్, ఊతని శరత్ బాబు, చంద్ర ప్రకాష్, రంజిత్ కుమార్, ఎస్వీయూ ఫార్మసీ కళాశాల, పద్మావతీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేనా..అయితే మాకేంటి?

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): గ్రీవెన్స్‌డే రోజు కలెక్టర్‌తోపాటు అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారు. వారిచ్చే అర్జీలను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. అయితే రేణిగుంటలోని అధికారులు మాత్రం గ్రీవెన్స్‌డేనా.. అయితే మాకేంటి?.. అన్నట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగానే సోమవారం ఉదయం 11.30 గంటలైనా రేణిగుంట మండల పరిషత్ కార్యాలయానికి అధికారులు ఎవ్వరూ హాజరు కాలేదు. కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చారు. సోమవారం పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన రోజుల్లో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని పలువురు చర్చించుకోవడం కనిపించింది.



రేణిగుంట ఎంపీడీఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,198 మంది స్వామివారిని దర్శించుకోగా 25,665 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.94 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

నేటి నుంచి కనుపూరు జాతర

చిల్లకూరు : మండలంలోని తీర ప్రాంత గ్రామమైన తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి నుంచి అట్టహాసంగా జాతర నిర్వహించనున్నారు. ఉగాది పండుగకు ముందుగా వచ్చే మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు మూడు రాష్ట్రాల నుంచి భక్తులు సుమారు ఐదు లక్షల మంది వరకు తరలి వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. పేరుకు ముత్యాలమ్మ జాతర అయినప్పటికీ ఇక్కడ ముత్యాలమ్మ సోదరిగా భావించే పోలేరమ్మకు కూడా జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఘటోత్సవంతో జాతర ఆరంభం

జాతరలో భాగంగా తొలిరోజు ఆదివారం అర్చకులు చాకిరి రమణయ్య ఇంటి నుంచి ఘటోత్సవాన్ని ఆరంభించారు. అక్కడ పనిబాపల వారు ఘటం కుండను నెత్తిన పెట్టుకుని పంచాయతీలోని కొమవారిపాళెం, పోసిన వారిపాళెం, ఈదుల వారిపాళెం గ్రామాలలో ఎంపిక చేసిన వారి ఇళ్లకు వెళ్లి సద్ది పోసుకునే తంతు ముగించుకుని తిరిగి కనుపూరుకు వేంచేశారు. ఆ తరువాత చాకలి ఇంటి వద్ద ఘటం కుండలు దించి పోలేరమ్మ ప్రతిమను కుమ్మరి ఇంట్లో తయారు చేయించే ప్రక్రియను మొదలు పెడతారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన తరువాత పొలి కార్యక్రమం ఉంటుంది. అమ్మ వారి ప్రతిమ గంగ మిట్టమీద కొలువుదీరే సరికే మంగళవారం అర్ధరాత్రి అవుతుంది. అప్పటి నుంచి జాతర ఆరంభమైనట్లు గణాచారి ప్రకటిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ ఏర్పాట్లను గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీన, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సేవా కమిటీ సభ్యులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, మారాని సుబ్రహ్మణ్యం, సారంగం రమేష్ పర్యవేక్షిస్తారని తెలిపారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో ముత్యాలమ్మ ఆలయం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ



ఘటం కుండలను గ్రామాలకు పంపుతున్న గ్రామ పెద్దలు

పటిష్ట బందోబస్తు

భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 500 మంది పోలీసులతో బందో బస్తు ఏర్పాటు చేస్తున్నట్లు గూడూరు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. రూరల్‌సీఐ కిశోర్ బాబు, చిల్లకూరు ఎస్ఐ సురేష్‌బాబులు పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

భక్తులకు కనువిందు చేసేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను చేపడుతున్నారు. ప్రతి రోజూ యారా గురనాథస్వామి గ్రామోత్సవంతో పాటుగా గొల్లల వేడుకలు ఉండనున్నాయి.

సమస్యలకు పరిష్కారం చూపండి

- అర్జీదారులను తిప్పించుకోవద్దు
- చిన్నచిన్న సమస్యలు వెంటనే పరిష్కరించండి
- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్

వితంతు పింఛన్ ఇప్పించండి బాబూ



నా పేరు రేణుక. మాది తిరుపతిలోని ఎస్‌బీఐ కాలనీ. అద్దె ఇంట్లో ఉంటున్నాను. నా భర్త మోహన్‌రాజ్ ఏడు నెలల క్రితం గుండె పోటుతో మృతి చెందారు. నాకు కన్న (13 ఏళ్లు) కుమారుడు, చామంత్రి (8 ఏళ్లు) కుమార్తె ఉన్నారు. నా తల్లి విజయమ్మ నా తోనే ఉంది. నలుగురం జీవించాల్సి ఉంది. కుటుంబ పెద్దను కోల్పోవడంతో పూట గడవడం కష్టంగా ఉంది. వితంతు పింఛన్ కోసం తిరుగుతున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. తెల్లరేషన్‌కార్డు ద్వారా వచ్చే రేషన్ బియ్యం తప్ప ఏమీ ఆధారం లేదు.

ఇలా చేయడం న్యాయమేనా?



నా పేరు తీగల భాస్కర్ రావు. నా భార్య పేరు రాజేశ్వరి. మాది నాయుడుపేట మండలంలోని పుదూరు గ్రామం. సాగరమాల రోడ్డుకు మా భూమి 1.8 ఎకరాలు పోతుంది. దీంతో నేను ఆ భూమిని ఇవ్వలేనని జిల్లా రెవెన్యూ అధికారులకు చెప్పాను. నా భూమి తప్పనిసరిగా ఇవ్వాలంటే మరోచోట నాకు భూమి ఇవ్వాలని కోరాను. ఈ విషయంపై గ్రీవెన్స్‌లో సోమవారం ఓ జిల్లా అధికారికి వివరించాను. అయితే ఆయన నీవు నాతో మాట్లాడొద్దు వెళ్లిపో అంటూ బెదిరింపులకు దిగారు. ఆపై సిబ్బంది బలవంతంగా నన్ను బయటకు పంపేశారు. గ్రీవెన్స్‌లో నా బాధను చెప్పుకోవడానికి వస్తే ఇలా చేయడం న్యాయమేనా..?

భూ పరిహారం ఇవ్వండి సార్



నాపేరు ఎం.సుగుణ. మాది గాదంకి రెవెన్యూ గ్రామం. పాకాల మండలం. జాతీయ రహదారికి మా భూమి 89 సెంట్లు పోయింది. అయితే ఆ భూమికి భూ పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదు. మాకు ఉన్నది ఆ భూమి మాత్రం. పరిహారం ఇప్పించకుంటే జీవనం కష్టంగా మారుతుంది. న్యాయం చేయండి.. అంటూ కలెక్టర్‌కు విన్నవించారు.

తిరుపతి అర్బన్: అర్జీదారుల సమస్యలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు 306 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ సమస్యలపై 201 అర్జీలు ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. కలెక్టర్ తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, శివ శంకర్‌నాయక్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గందరగోళం

అర్జీల కౌంటర్‌ను కలెక్టరేట్ హాల్‌లో నుంచి అర్జీల ఆన్‌లైన్ కౌంటర్ వద్దకు మార్పు చేయడంతో అంతా గందరగోళం నెలకొంది. ఈ వారం మాత్రం ఇలా ఎందుకు చేశారంటూ పలువురు మండిపడ్డారు.

27న చలో మంగళగిరి

న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న చలో మంగళగిరి కార్యక్రమంలో భాగంగా గురువారం ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కార్యాలయంలో నిరసన చేస్తామని ఆరోగ్యమిత్రలు వెల్లడించారు. ఆ మేరకు సోమవారం ఆరోగ్యమిత్రలు విధులను బహిష్కరించి కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

దళారీలు దోచుకుంటున్నారు

వరి ధాన్యం కొనుగోలు విషయంలో దళారులు దోచుకుంటున్నారంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా వరిధాన్యం బస్తా 75 కేజీలు చొప్పున కొనుగోలు చేయాల్సి ఉందని, అయితే నెమ్ములు అంటూ 80 కేజీలు చొప్పున దండుకుంటున్నారని వాపోయారు. ప్రశ్నిస్తే దళారులు దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన చెందారు. గత ఏడాదితో పోల్చుకుంటే తక్కువ ధరకు వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని వెల్లడించారు. ఆ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఆరోగ్యమిత్రలు

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ (సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ) ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభావంతుల నుంచి ఉగాది పురస్కారాలు–2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సేవ, సాహిత్యం, వైద్యం, సంగీతం, కళలు, క్రీడలు, కరాటే, నాటకం, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధి కల్పన, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రతిభావంతులు ఉగాది పురస్కారాలకు అర్హులని తెలిపారు. ఎంపిక చేసిన వారికి ఏప్రిల్ 13వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఉగాది పురస్కారాలను అందించి సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ సేవలు, ప్రతిభలను తెలిపే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్, గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్లు, ఫొటోలు జిరాక్స్‌లతో దరఖాస్తులను ఈనెల 31వ తేదీలోపు పంపించాలన్నారు. ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నెంబర్ 01-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9652347207ను సంప్రదించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

ఆటోలో నుంచి పడి వ్యక్తి మృతి


చిట్టేడు వద్ద రోడ్డుపై వెంకటయ్య మృతదేహం

కోట: గూడూరు వైపు వెళ్తున్న ఆటో నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చిట్టేడు వద్ద ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దుగ్గరాజపట్నంకు చెందిన ఎంబేటి వెంకటయ్య(55) అనారోగ్యంతో ఆటోలో గూడూరు హాస్పిటల్‌కు వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు చిట్టేడు వద్ద ఆటో నుంచి జారి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. 108 సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుండె పోటుకు గురై ఆటో నుంచి కింద పడి ఉంటాడని 108 సిబ్బంది అనుమానిస్తున్నారు.

కళకళలాడిన వెటర్నరీ కళాశాల


తరగతి గదుల్లో విద్యార్థులు

తిరుపతి సిటీ:వెటర్నరీ జూడాలు ఎట్టకేలకు సమ్మెను విరమించారు. సోమవారం నుంచి ఎస్వీ వెటర్నరీ కళాశాల తరగతి గదులు 52 రోజుల తర్వాత తాళాలు తెరుచుకున్నాయి. దీంతో విద్యార్థులు, అధ్యాపకులతో తరగతి గదులు కళకళలాడాయి.

సీ.గొల్లపల్లి సచివాలయంలో చోరీ


తలుపు గడియను విరిచేసిన దుండగులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లి గ్రామ సచివాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు సోమవారం ఉదయం కార్యాలయానికి చేరుకోగానే అప్పటికే తలుపులు తెరిచి ఉండడంతో లోనికి వెళ్లి పరిశీలించారు. సచివాలయంలోని ఓ ప్రింటర్‌ను అపహరించుకువెళ్లినట్టు గుర్తించారు. దీనిపై తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతుల జాబితాలో గందరగోళం నెలకొంది. ర్యాంకు ఆధారంగా ఫైనల్ జాబితా సిద్ధం చేశారంటూ ఆందోళన మొదలైంది. డేట్ ఆఫ్ జాయినింగ్ పక్కన పెట్టారని, జాబితా తయారీలో అన్యాయం జరిగిందంటూ పలువురు ఏఎన్‌ఎంలు ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగోన్నతుల కోసం తప్పుడు పత్రాలు సమర్పించారని, సిఫార్సులకు పెద్దపీట వేశారని, ఎస్టీ కేటగిరికి జనరల్‌లో అన్యాయం జరిగిందంటూ ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.

- వైద్య ఆరోగ్య శాఖలో ఇష్టారాజ్యం
- 2 రోజుల్లో ఏఎన్‌ఎంల పదోన్నతుల జాబితా ప్రకటన?
- ర్యాంకు ఆధారంగా ఫైనల్ లిస్టు సిద్ధం
- డేట్ ఆఫ్ జాయినింగ్‌ను పక్కన పెట్టిన వైనం
- ఏఎన్‌ఎంల ఆందోళన



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట ఏఎన్‌ఎంల నిరసన

ఉదాసీనంగా ఉద్యోగోన్నతులు!

కాణిపాకం : సచివాలయ వ్యవస్థ కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,069 మంది ఏఎన్‌ఎంలు పని చేస్తున్నారు. ఫస్ట్ ఏఎన్‌ఎంలుగా 247 మంది, సెకండ్ ఏఎన్‌ఎంలుగా 644 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా కొన్నేళ్లుగా సెకండ్ ఏఎన్‌ఎం, కాంట్రాక్టు ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వర్తించడంతో 2019లో జరిగిన గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ పోస్టులకు కొందరు డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ ద్వారా 10 నుంచి 15 మార్కుల వెయిటేజీతో విధుల్లో చేరారు.

విడతల వారీగా చేరుతూ..

గ్రామ, వార్డు సచివాలయాలు 2019 అక్టోబర్ 2న ప్రారంభం కాగా, హెల్త్ సెక్రటరీలుగా సరైన రికార్డులతో విధుల్లో చేరాల్సి ఉంది. అందులో కొందరు అక్టోబర్ 14న కొంత మంది విధులకు రిపోర్టు చేశారు. మరికొంత మంది అక్టోబర్ 16 నుంచి డిసెంబరు నెలాఖరు వరకు విధుల్లో చేరుతూ వచ్చారు. జిల్లాలో మూడు విడతలుగా పోస్టింగ్ ఆర్డర్లు విడుదల చేయగా.. అభ్యర్థులు వారికి అనుకూలమైన తేదీల్లో జాయినింగ్ అయ్యారు.

రూపకల్పన ఇలా..

గ్రేడ్–3 ఏఎన్‌ఎం నుంచి గ్రేడ్–2 ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతులకు గతేడాది ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ మేరకు జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రేడ్–2 పోస్టులకు అర్హుల జాబితా తయారవుతోంది. ఈక్రమంలో ఎస్టీ కేటగిరికి 6 శాతం, ఎస్సీకి 15 శాతం రిజర్వేషన్ ప్రకారం చేశారు. అయితే జనరల్ కేటగిరిలో ఎస్టీ కేటగిరికి తీవ్ర అన్యాయం జరిగిందని గోలగోల చేస్తున్నారు. ఎస్టీ కులానికి చెందిన కొందరు ఏఎన్‌ఎంలకు మెరిట్ ఉన్న జనరల్ కేటగిరిలో వారిని పక్కన పెట్టేశారని, వికలాంగులను పట్టించుకోలేదనే వాదనలు ఉన్నాయి. సిఫార్సులకు తలొగ్గినట్లు విమర్శలు వస్తున్నాయి. కొన్నింటికి బేరసాలు జరిగినట్లు, కలెక్టర్ బంగ్లాకు సమీపంలోని ఓ కేఫ్‌లో బేరసాలు జరిగినట్లు కొందరు ఆరోపిస్తున్నారు.

తప్పులు కప్పిపుచ్చే ప్రయత్నం

ఉద్యోగోన్నతుల జాబితా తయారీలో పలు ఆరోపణలు వస్తున్నాయి. జాబితాలో తప్పులు ఉన్నా వాటిని కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై యంత్రాంగం ప్రశ్నించిన జాబితా విషయంలో దొరక్కుండా సమాధానం ఇవ్వాలని హుకుం జారీ అయినట్లు సమాచారం.

స్పష్టత లేని జాబితా

గ్రేడ్–3 ఏఎన్‌ఎంలు 1069 మంది ఉన్నారు. ఉద్యోగోన్నతుల్లో భాగంగా ఇటీవల విడుదల చేసిన మెరిట్ లిస్టులో 307 మంది పేర్లను ప్రకటించారు. ఇందులో 297 మందికే పదోన్నతులు ఉంటాయని చెప్పడంపై గందరగోళంగా మారింది. దీనిపై అనుమానం రావడంతో తమకు అన్యాయం జరిగిందంటూ కొంత మంది కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఈ మేరకు మరో 5 పోస్టులు ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శాఖ కమిషనర్‌కు నివేదికలు సమర్పించినట్లు తెలుస్తోంది. దీంతో ఆ 5 మంది పేర్లను జాబితాలో చేర్చారని తెలిసింది.

ఉమ్మడి జిల్లా ఏఎన్‌ఎంల వివరాలు..

సచివాలయ ఏఎన్‌ఎంలు –	1069
ఫస్ట్ ఏఎన్‌ఎంలు –	247
సెకండ్ ఏఎన్‌ఎంలు –	644
పదోన్నతుల జాబితా –	307
ఎస్టీల రిజర్వేషన్ –	6 శాతం
ఎస్సీల రిజర్వేషన్ –	15

ఆర్డర్ మేరకు ఇవ్వాలి..



వైద్య ఆరోగ్యశాఖలో ర్యాంకు ప్రకారమే పదోన్నతులు చేస్తామని చెబుతున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేశాం. కలెక్టర్ అపాయింట్ ఆర్డర్ ప్రకారమే చేస్తామని హామీ ఇచ్చారు. అయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం ర్యాంకు ప్రకారమే చేస్తామని చెబుతున్నారు. అప్పుడు మూడు బ్యాచ్‌లుగా తీసుకున్నారు. ఇప్పుడు ఫస్ట్ బ్యాచ్‌కు పదోన్నతుల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. – గీత, ఏఎన్‌ఎం

పారదర్శకంగా చేపడుతాం



ఏఎన్‌ఎంల పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల మేరకు పారదర్శకంగా చేస్తున్నాం. కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్నాం. 307 మందితో మెరిట్ లిస్ట్ ఇచ్చాం. ఆ 307 మందికి పదోన్నతులు ఉండవు. 297 మందికే ఉంటాయి. జాబితాలో ఏవైనా లోటుపాట్లు ఉంటే..అందుకు అదనంగా కొంత మందిని లిస్టులో పెట్టాం. మరో 5 మందిని జాబితాలోకి తీసుకోలేదు. ఇంకా జాబితా పూర్తి కాలేదు. – సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

నేటి నుంచి పరీక్షలు

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డులో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, అనలిస్ట్ గ్రేడ్–ఐఐ పోస్టులు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించిన పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఆర్వో నరసింహులు తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. పరీక్షలు నేటి నుంచి మూడు రోజుల పాటు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో రెండు సెంటర్లలో 2,080 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్టు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు పద్మలలిత, శివప్రసాద్ పాల్గొన్నారు.

విభిన్న ఆలోచనే ఆవిష్కరణకు నాంది


మాట్లాడుతున్న ఐజర్ డైరెక్టర్ శంతాను భట్టాచార్య

ఏర్పేడు(రేణిగుంట) : విభిన్న ఆలోచనే నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతుందని తిరుపతి ఐజర్ డైరెక్టర్ సంతాను భట్టాచార్య తెలిపారు. సోమవారం ఏర్పేడు మండలం జంగాలపల్లె సమీపంలోని ఐజర్‌లో ఐదు రోజులపాటు జరగనున్న ఫ్యాకల్టీ ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ఆయన ప్రారంభించారు. డైరెక్టర్ మాట్లాడుతూ దేశ జనాభా ప్రయోజనాలను ఆవిష్కరణలుగా మార్చాలని సూచించారు. ప్రొఫెసర్ విజయమోహనన్ కె.పిళ్లై, ఎస్‌ఎస్‌ఐఐటీ సీఈఓ డాక్టర్ జె.సూర్యకుమార్, జీనోమ్ వ్యాలీలోని ఐకేపీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ విశ్వనాథం దుప్పట్ల పాల్గొన్నారు.

సాగరమాల రోడ్డు పనుల అడ్డగింత


టిప్పర్లను అడ్డుకుని ధర్నా చేస్తున్న రైతులు

నాయుడుపేట టౌన్ : పొలాల్లోకి వెళ్లేందుకు వీలుగా సాగరమాల జాతీయ రహదారిలో అండర్ పాస్ బ్రిడ్జిలు, సర్వీసు రోడ్లు వేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. వారు సోమవారం చిలమత్తూరు సమీపంలో సాగరమాల రోడ్డు పనులను అడ్డుకుని ధర్నా చేశారు. రైతు సంఘం నాయకులు వాకాటి సుధాకర్ రెడ్డి, సన్నారెడ్డి హరినాథ్‌రెడ్డి, జలదంకి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడారు. భూసేకరణ సమయంలో రైతులకు ఇబ్బంది లేకుండా సర్వీసు రోడ్లు వేస్తామని కలెక్టర్, సూళ్లూరుపేట ఆర్డీవో, తహసీల్దార్ హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు పొలాల మధ్య సుమారు 13 అడుగుల ఎత్తులో రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. రెండు వైపులా పొలాలున్న రైతులు పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొందని వివరించారు. నాయుడుపేట మండలంలోనే సుమారు 4 వేల ఎకరాల భూముల్లోకి వెళ్లేందుకు వీలు లేకుండా పోయిందని తెలిపారు. రోడ్డు నిర్మాణంపై తిరుపతి ఎంపీ గురుమూర్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతోపాటు సీఎం, డిప్యూటీ సీఎం, కేంద్ర మంత్రులకు రిజిస్టర్ పోస్టులో వినతి పత్రాలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో కామిరెడ్డి మధుసూదన్ రెడ్డి, జలదంకి ధనుంజయ రెడ్డి, కాపులూరు చంద్రమోహన్, చమతా రాజేష్, చిలమత్తూరు రత్నయ్య, ఎం వెంకయ్య, వెంకట రమణయ్య, శ్యామ్‌కుమార్ రెడ్డి, ధనుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు : తమ గ్రామాలకు వెళ్లేందుకు వీలుగా సాగరమాల రోడ్డు నుంచి సర్వీసు రోడ్లు వేయాలని పారిచర్లవారిపాళెం, తిప్పగుంటపాళెం, చేడిమాల, ఉడతావారిపార్లపల్లి, అంకులపాటూరు, బల్లవోలు, కాకువారిపాళెం ప్రజలు డిమాండ్ చేశారు. వారు సోమవారం తమ గ్రామాల వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలో వరగలి క్రాస్ రోడ్డు నుంచి తూర్పుకనుపూరు వరకు సాగరమాల రోడ్డు వేస్తున్నట్టు తెలిపారు.

పలు గ్రామాలకు వెళ్లేందుకు సర్వీస్ రోడ్లు వేయడం లేదన్నారు. మూడు కిలోమీటర్లు తిరిగి తమ గ్రామాలకు చేరు కోవాల్సి వస్తోందని వాపోయారు. సమస్యను కాంట్రాక్టు సంస్థకు తెలిపితే తమకు సబంధం లేదని తెగేసి చెప్పారని విమర్శించారు. ఈ విషయాన్ని తిరుపతి ఎంపీ గురుమూర్తి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని సర్వీసు రోడ్లు వేయాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ గురుమూర్తి కేంద్ర మంత్రి గడ్కరి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు ఫోన్‌లో తెలిపారు.


నిరసన తెలుపుతున్న తిప్పగుంటపాళెం గ్రామస్తులు


నిరసన తెలుపుతున్న బల్లవోలు గ్రామస్తులు

మోసకారి బాబు

వాకాడు: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి విరుద్ధంగా రాష్ట్రంలోని దళితులను చంద్రబాబు మోసం చేస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ రిటైర్డ్ కమిషనర్ ఉయ్యాల రామకృష్ణ ధ్వజమెత్తారు. మండల కేంద్రమైన వాకాడు ఇరిగేషన్ అతిథి గృహంలో సోమవారం సమాజ చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మాలలు, మాదిగలను వేరుచేసే కుట్ర రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. దీనిని అందురూ ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. సమాజ చైతన్య సమితి సభ్యులు రంగనాథ్, కారల్, వసంత్, కోటి, కృష్ణయ్య, పోలయ్య, ఏడుకొండలు, జనార్దన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ రిటైర్డ్ కమిషనర్ రామకృష్ణ

కులంలో చిచ్చుపెట్టే కుట్ర

శ్రీకాళహస్తి: కులంలో చిచ్చు పెట్టడానికి కుట్ర చేస్తున్నారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరు చెంగయ్య అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో పలువురు నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ప్రధాని మోదీతో ఒప్పందం మేరకు సీఎం చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ అమలును తెరమీదకు తీసుకొచ్చారన్నారు. చింతా రాజేంద్ర, కోగిల ధర్మయ్య, తలారి శ్రీనివాసులు, సుదర్శనరావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

వాణిజ్య పన్నుల శాఖాధికారికి అస్వస్థత!


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాణిజ్య పన్నులశాఖాధికారి

చిల్లకూరు: గూడూరు రెండో పట్టణ పరిధిలోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో పనిచేసే అధికారి ఏసురత్నం అస్వస్థతకు గురైన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ మేరకు ఆయన గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని అక్కడకు వెళ్లి విచారించే ప్రయత్నం చేయగా ఆయన పొంతన లేని విషయాలు చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. కార్యాలయానికి వచ్చిన ఆయన ఒక గంట తర్వాత అపస్మారక స్థితికి చేరినట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఆయనకు నిద్ర మాత్రలు మింగే అలవాటు ఉందని, అందువల్ల పడిపోయి ఉంటాడని అంటున్నారు. కానీ పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉండొచ్చని క్రింది స్థాయి సిబ్బంది చెబుతుండడం గమనార్హం. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

కార్యదర్శులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఈఓ రవికుమార్‌నాయుడు, డీపీఓ సుధాకర్‌రావు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు బదిలీలపై సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జెడ్పీ సమావేశ మందిరంలో సీఈఓ రవికుమార్‌నాయుడు, డీపీఓ సుధాకర్‌రావు ప్రక్రియను నిర్వహించారు. గ్రేడ్ 5 నుంచి గ్రేడ్ 4కు పదోన్నతి పొందిన పంచాయతీ కార్యదర్శులు ఆప్షన్ పెట్టుకున్నారు. మొత్తం 83 మంది బదిలీలకు అర్హత సాధించగా అందులో 77 మంది వారు కోరుకున్న స్థానాలను తెలియజేశారు. సంబంధిత పత్రాలను అధికారులు పరిశీలించారు. ఈ నివేదికను ఆమోదం కోసం కలెక్టర్‌కు పంపుతామన్నారు. ప్రక్రియ పూర్తయిన తర్వాత తదుపరి ఉద్యోగుల ఉద్యోగోన్నతి, బదిలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఖాళీల భర్తీలను ప్రభుత్వ ఆమోదంతో ఉద్యోగోన్నతి ద్వారా చేపడతామన్నారు.

కార్మికులు జాగ్రత్తలు పాటించాలి

చిత్తూరు కార్పొరేషన్: ఎండ తీవ్రతకు గురి కాకుండా కార్మికులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చిత్తూరు, తిరుపతి జిల్లాల ఉపకార్మిక కమిషనర్ ఓంకార్ రావు కోరారు. కార్మికుల రక్షణ కోసం పారిశ్రామిక యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తలపై టోపీ పెట్టుకోవడం, తెలుపు రంగు గల పలుచటి కాటన్ వస్త్రం ధరించడం, ఉప్పు కలిపిన మజ్జిగ తీసుకోవడం, మంచి నీళ్లు ఎక్కువ సార్లు తాగడంపై కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కార్మికులను బ్యాంకు, ఇతర పనుల మీద బయటకు పంపకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పని ప్రదేశంలో నీడ, నీటి వసతి కల్పించాలన్నారు. స్థానిక గ్రామ వార్డు సచివాలయం వైద్య సిబ్బందిని సమన్వయం చేసుకుని ఫ్లూయిడ్స్, అత్యవసర మందులు సమకూర్చుకోవాలన్నారు.

దేహదారుఢ్యానికి ఫిజిక్ పోటీలు



విజేతకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: దేహదారుఢ్యానికి ఫిజిక్ పోటీలు ఉపయోగపడుతాయని గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ తెలిపారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల బాడీ బిల్డింగ్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఏడవ పురుషులు, మహిళల బాడీ బిల్డింగ్‌తో పాటు మోడలింగ్ పోటీలు సోమవారం యూత్ హాస్టల్లో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మెన్ ఫిజిక్, ఉమెన్ ఫిజిక్ విభాల్ని బాడీ బిల్డింగ్ అసోసియేషన్‌లో చేర్చడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీలలో ఎస్.మణి, ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆదినారాయణ, నవీన్ రోహిత్, విగ్నేష్‌లు విజేతలుగా నిలిచారు. అలాగే మెన్ మోడలింగ్‌లో ఆదిత్య, ఉమెన్ మోడలింగ్‌లో నికిత, గాయత్రి, భావన, సిమ్రాన్ విజేతలుగా నిలిచారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్ ప్రకాష్, శివ ప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ కె.రామచంద్ర, యోధ గ్రూప్ చైర్మన్ బీఎస్ఆర్.యోగేష్, ఒలింపిక్ స్టేషన్ మిస్ యూనివర్స్ ఉమెన్ ఫిజిక్ సాయక్‌హజ్ రూమ్(బాంబే), కార్యదర్శి ఆర్.శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు.

నిమ్మతోట ఆక్రమణకు యత్నం

కలువాయి(సైదాపురం): నిమ్మ తోట ఆక్రమణకు యత్నించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన ఘటన కలువాయి మండలం, చీపినాపి గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత రైతు పసల కృష్ణయ్య, గ్రామస్తుల కథనం.. గ్రామ పరిధిలోని సర్వే నం.379లో 8.16 ఎకరాల భూమిలో కృష్ణయ్యకు 1.16 ఎకరాల వరకు ఉంది. ఇందులో గత 14 ఏళ్లుగా నిమ్మ చెట్లు సాగు చేసుకుంటున్నాడు. కూటమి నేతలు కొందరు నిమ్మచెట్లను ధ్వంసం చేసి పొలం చుట్టూ ఫెన్సింగ్ వేశారు. దీనిపై బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. పొలం వైపు వెళ్తే క్రిమినల్ కేసులు బనాయిస్తామని పోలీసులు బెదిరిస్తున్నట్టు వాపోయాడు. ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.